# బిడ్డ

సాయంత్రం భోజనమై కూర్చున్నప్పుడు ఆ ప్రాంతాలలో జరిగిన శిశు హత్య విషయం ప్రస్తావనలోకి వొచ్చింది. శీతయ్యగారు అన్నారు కదా- "ఇల్లాంటి పనులు యెట్లా జరుగుతాయో తెలీదు. కసాయివాడి నౌకరు ఆ పిల్లని పాడుచేశాడూ? ఆ పిల్ల బిడ్డనికని కుడితితొట్టిలో పారేసిందీ! ఆ పిల్లని బాగా చంపనన్నా చంపలేదుట కాదూ?"

మాతో భోజనం చేసిన డాక్టరు రామచంద్రరావు ఆ హత్యలోని భయోత్పాతమైన తప్పిళ్ళన్ని చెప్పాడు. ఆయనకి ఆశ్చర్యం కలిగించిందేమంటే-వొంటరిగా యే సహాయమూ లేకుండా పిల్లని కని, దాని చంపడానికని, కన్న వెంటనే రెండు మైళ్ళు నడచిన ఆ ఆడదానికి యెంత ధైర్యమో, యెంత శక్తో అని ఆశ్చర్యపడ్డాడు. "ఎంత పట్టుదల అండీ! ఆ యేడ్చే పిల్లని చేతుల్లో పట్టుకుని (ఇంకా తడిగా వున్న ఆ పిల్లని) అర్ధరాత్రి ఆ చిట్టడివిలో నడిచి వెళ్ళిందంటే, యెంత పైశాచిక దేహబలం కావాలో ఆలోచించుకోండి. సాధారణ శరీరంలో అంత బలాన్ని కల్పించిన నైతిక వేదనని తలుచుకుంటే నా గుండె దడదడలాడుతోంది. ఆమె ఆత్మ యెంత భయంతో వణికిందో, ఆమె హృదయం యెంత దారుణమైనదో, అసహ్యకరమైనదో, నీచమైనదో, ఆ పిల్ల చేసిన క్రూరకృత్యంకన్న, అతి దారుణమూ, నీచమూ, క్షమింపరానివీ

అయిన పవిత్రాభిప్రాయాలు - ఆ పిల్లకన్న తాము అధికులమనీ, మర్యాదస్తులమనీ, ఖండించి ఆ పిల్లచేత అట్లాంటి పనులు చేయించిన ప్రజల క్రూరత్వం ! ఈ ఆడపిల్లల్ని లొంగతీసి, వాళ్ళచేత వాళ్ళ కోర్కెల్ని అనుభవించమని బలవంతంచేసే, యీ జీవితశక్తికి పర్యవసానంగా పాపం, హత్యలూ, శిశుహత్యలూ, భ్రూణహత్యలూ, బలవంతంగా చేయించే దెవరు? అసహజమైన నైతికాభిప్రాయాలు, యేహ్యమైన మర్యాదలూ, బూజుపట్టి కుళ్ళి, కులకులలాడే పాతివ్రత్య నియమాలూ- వీటిలో, మురుగులో, ఆ కుళ్ళులోనే పురుగుల్లాగు ఆనందంగా బతికే ఈ సంసార స్త్రీలు - వీళ్ళా ఈ దారుణ కృత్యాలకి కారణం. వాళ్ళని శిక్షించాలి యీ ప్రభుత్వంవారు. ఇటువంటి నీతి చట్టాల్ని స్థాపించి, సహజమైన స్త్రీ పురుష సంయోగాన్ని శిక్షార్హంగా చేసిన యీ సంఘం ఎంత అవమాన పడాలి తననిచూసి తాను!"

ఆ మాటలు విని శీతాయమ్మగారు మండిపడ్డది, "చాలా బావుంది! పతివ్రతకన్నా వెలయాలు పుణ్యాత్మురాలనేనా మీ వాదన! తన అంతరాత్మ బోధన ప్రకారం; ధర్మమే తన దైవంగా, పతినికొలిచే పుణ్యస్త్రీకన్న, తన మనసు యెటులాగితే అట్లా, తన దేహవాంఛలకి లోబడి, సౌఖ్యాలు అనుభవించే సిగ్గూ, అభిమానమూ, విడిచి వ్యభిచరించే స్త్రీ అత్యుత్తమురాలా? బాగా వున్నాయి మీ మాటలు!"

తాను స్వయంగా చూసిన అనేక ఘోరాలవల్ల డాక్టరు హృదయం గాయపడివుంది. ఆయన లేచి చాలా పట్టుదలగా మాట్లాడాడు.

"అమ్మా! మీకేమీ తెలీని విషయాన్ని గురించి మీరు చాలా తెలిసినట్టు మాట్లాడుతున్నారు. పెద్దలు చెప్పనవీ, పుస్తకాల్లో చదివినవీ ఆ ధర్మాలు యేకరువు పెట్టారుగాని, వాస్తవమైన లోకం చూసికాదు. ఏ నిగ్రహానికి లొంగని తీవ్రమైన కోర్కెల్ని మీ రెరుగరు. మీకేమి అర్థమవుతుంది, యితరుల సంగతి? నేను కళ్ళారా చూసిన ఒక జీవిత చరిత్రను చెపుతాను వినండి. మీకు అర్థంకావు యీ విషయాలు అర్థం చేసుకోరు. చేసుకోడం మీ ఆచారానికి, మీ క్షేమానికి, ఘనతకి విరుద్ధం.

ప్రయత్నించి దయతో, సహనంతో, జాలితో సానుభూతి చూపితేనేగాని, అటువంటి నిర్భాగ్యుల అవస్థలు అర్థంకావు. అతిబలీయమైన కోర్కెలతో చీల్చుకుపోతాయి యీ పతితుల హృదయాలు. సౌమ్యమూ, జీవ రహితమూ, అల్పమూ. నిర్మలమూ, అయిన శక్తులుగల యీ పుణ్యాత్ములకు చాలా సులభం నీతి మార్గాన సంచరించడం. వారు పోరాడి జయించవలసిన గొప్ప శత్రువులు లేవు వారి స్వభావాలలో. శీతలరక్త ప్రవాహం కలిగిన ఈ సాధారణ సంసారస్త్రీలు, నీతి విషయంలో చాలా కఠినులు. వారి మెదడు చాలా హీనస్థితిలో వుంది. వారు చూపే ప్రేమా అంతే. కొద్దిమంది మీద కొద్దిగా చూపుతారు. వారివంటి మర్యాదస్తులకే తృప్తి నిస్తుంది అది. జారిపడిపోయిన స్త్రీలను చూసి క్రౌర్యం చూపుతారు. తమకు సాధ్యంకాని మోహాన్ని వాళ్ళు అందుకో గలిగారనే ఈర్ష్య కావొచ్చును. ఈ పతితులకు మర్యాద అన్నా, నీతి అన్నా చాలా గౌరవమే. కాని వారి హృదయ శక్తులు ఆ గౌరవాన్ని అణతొక్కేటంత ఉధ్రుతము గలవి. ఈ సంసార స్త్రీలు శాంతంగా నిద్రపోగలరు. రాత్రులు సాధారణ అలవాట్లలో తృప్తిపడి వారికేమీ భయంకరాలైన కలలు రావు. సాహసకృత్యాల్ని చేయించే దారుణకృత్యాలు వారికి నిద్రాభంగం కలిగించవు. ఎవరో ఒక భర్త మంత్రాలతో పవిత్రమైన హక్కు కలిగిన వాడు, ఆమెతో పడుకోవచ్చని లోకం అంగీకరించిన మనిషి వుంటే చాలు. అప్పు డప్పుడు యేదో అప్రయత్నంగా కోర్కెలు స్వల్పంగా బాధిస్తాయి. ఎందుకంటే, ఎంత పవిత్రులైనా మీరు మనుషులేగా! కాని ఆ కోర్కెలు అప్పుడే అణగిపోతాయి. నగలలో, పట్టుచీరెలలో, పెళ్ళి సంబంధాల ప్రయత్నాలతో, కొందరు కోర్కెలకి లోబడినా, చాలా వివేకంతో, రహస్యంగా జారి, మళ్ళీ కాళ్ళు కుదుటపరుచుకుని, మరింత తీవ్రంగా నీతి చర్చలుచేసి, గుంపుని కలుసుకుంటారు. ఏ పాపం చేసినా మనసులోనేగాని, శరీరాన్నేమీ అంటదు. ఏం పాపంచేసినాగదుల్లోనే గాని, లోకానికి కంటపడదు. కామోద్రేకులై పుట్టిన వాళ్ళ శరీరాలు వాళ్ళ స్వాధీనంలో వుండవు. ఇంద్రియాలు విచ్చలవిడిగా ఈడుస్తాయి. వాటిని అరికట్టడం వారి స్వాధీనంకాదు. అట్లాంటి కోర్కెలే మీకు వుంటే మీ యింద్రి

యాలు మీ స్వాధీనం కావు. వాయువుల్నిగాని, సముద్రాన్నిగాని అడ్డు పెట్టగలరా? ఏ కామమూ తమ స్వభావంలో లేకండా, యే సౌఖ్యమూ ఇతరులకి యివ్వలేని స్త్రీలు. ఏ కల్మషమూలేని స్త్రీలు, శుద్ధ వ్యర్థులు. వాళ్లు నీతి మార్గంలో వున్నారంటే, అది వాళ్ళకేమీ ఘనతకాదు. మెసలినాలనూ రష్యా క్యాతరిన్లనూ నీతిపథంలో చరించమంటే న్యాయమా? అద్భుతమైన ఆలింగనాలకై అవతారమెత్తిన వాళ్ళు! వాళ్ళ శరీరాలే' రక్తమే, అంగాలే వేరే విధంగా నిర్మింపబడతాయి. చప్పున ఎక్కువగా వుద్రేకపడగలవి. ఒక ఆశగాని, ఒక అభిప్రాయంగాని, యితరుల సమీపత్వంగాని, వారి భావాల్ని భగ్గుమనిపింపచేస్తాయి. వారి నరాలు తిరగబడి, వారిని వేటాడి కదిలించి, లోబరుచుకుని, ఆడించేస్తాయి. చిలకలకి పెట్టే గింజలు పెట్టి డేగల్ని బతికించగలరా?

రక్తమూ, యింద్రియాలూ, చూపేశక్తిని మీబోటివా రర్థంచేసుకోగలరా? రాత్రులకు రాత్రులు యెడతెరిపిలేక, అన్ని ఝాములూ, చీల్చి, చీల్చి, బాధపెట్టి, వొంటినంతా మండించి, గుండెకు విరామ మివ్వకండ పిండిపిండి, ఎంత తోసేసినా పోనీ రూపాలనీ, ఆశల్ని కళ్ళ ముందు కనపరిచి, పిచ్చెక్కిస్తాయి- వారి అనుభవమూ అంత ఉన్నతి కలదే. మీకేం అర్థంకాగలదు వారి ఆనందం, వారి కామోద్రేకంలోన అపార సుఖం? కథ వినండి :

శశి అనే పిల్ల దురదృష్టవంతురాలు. వుద్ధృతమైన రక్తంతో పుట్టింది. నడక నేర్చుకునేప్పుడే ఆమెలో అనేక గుణాలు మొలకెత్తాయి. మీరు ఏమంటారంటే, అసహజమైన రోగమంటారు. అట్లాంటి కోర్కెలు లేని మనుషులే అసహజమైన, నీరస అల్ప జీవులనుకుంటానునుకోకండి. నా అభిప్రాయమే న్యాయమైనది. ఈ నీతి ప్రజలందరూ రక్తంలేక, శక్తి లేక ఎండిపోయే పీనుగలు. పెద్ద కండలు పెంచిన మనిషి వొచ్చి, మనుషులందరూ సహజంగా అంత బలంగానూ వుండాలని బోధిస్తోవుంటే, మనమేమైనా ఆశ్చర్యపడుతున్నామా? అట్లానే ఎవరైనా వేడిరక్తం, తీవ్ర వాంఛలు కలిగివుండడమే సహజమని బోధిస్తే మనం తిట్టడమెందుకు?

ఆ పిల్లకి పదేళ్ళప్పుడు ఆమెని నా దగ్గరికి పరీక్షకోసం తీసుకొచ్చారు. అప్పటికే సంపూర్ణంగా అన్ని అవయవాలు యెదిగాయి. కామోద్రేకం చేత బాధపడుతోంది. పూర్తిగా వికసించిన పువ్వులవంటి బలువైన పెదిమలు, బాగా బలిసిన కంఠం, వెచ్చని వొళ్ళు, పెద్దముక్కు బాగా తెరుచుకున్న ముక్కురంధ్రాలు, కళ్లు పైకెత్తితే చాలు మొగవాళ్ళని వుడుకెత్తించే చూపులు, అట్లాంటి ఆ వుద్రేకం గల మృగాన్ని యెట్లా తృప్తిపరచడం? ఏ కారణమూ లేకండానే రాత్రంతా యేడ్చేది. పాపం! ఆ పిల్లకే తెలీదు తన బాధ యేమిటో, ఎందుకో.

నా సలహామీద ఆ పిల్లకి పెళ్ళిచేశారు. రెండేళ్ళలో క్షయరోగం వచ్చి ఆ భర్త చచ్చిపోయినాడు. ఆమె అతని సత్తువనంతా లాగేసింది. రెండో పెనిమిటి పద్దెనిమిది నెలలలో పోయినాడు మూడోవాడు నాలుగేళ్ళు కాపురంచేసి అంతులేకండా పలాయనమైనాడు. ఇంక పెళ్ళి వీలులేదు. వొంటరిదైపోయి శశి ఎట్లాగో మర్యాదగా బతకాలని చాలా ప్రయత్నించింది. ఆమెకి నీతిమీద చాలమంది పతివ్రతలకన్న ఎక్కువ అభిమానం. తక్కిన మనుషులమల్లేనే, సంతోషంగా, నెమ్మదిగా, స్నేహంగా బతకాలనే ఆమె ఆశగూడా.

ఒకరోజు ఆమెకి నరాల "కన్వల్షన్" రోగం కలిగి భయమేసి నాకు కబురంపింది. నేనామెను పరీక్షచేసి, మొగాడి సంపర్కం లేకపోవడం కారణమని తెలుసుకున్నాను. అట్లా వొంటరిగా వుంటే చచ్చిపోతావని ఆమెతో నిజం చెప్పేశాను. ఆమె మర్యాదస్తురాలు. నలుగురిలో తిరిగి బతకవలసిన మనిషి. అందుకని నేను చెప్పిన విషయం లక్ష్యం చెయ్యక తోసుకు తిరగాలని చూసింది. కాని, సాధ్యంకాలేదు. ఏం చేస్తుంది ? అదేదో విపరీత జాడ్యమని తన కోర్కెతో యుద్ధం సాగించింది.

శరీరాన్ని అలయకొట్టి శాంతింప చెయ్యడానికని రాత్రులంతా, రోడ్లవెంబడి పరుగెత్తుతోంది. వొళ్ళంతా శూలాలవలె పొడుస్తోవుంటే, మూర్ఛ పడిపోయ్యేది. వూరంతా ఆమెకి పిచ్చి పట్టిందనీ, దెయ్యం పట్టిందనీ అనుకుంటున్నారు. నేను వెళ్ళి, సృష్టిపెట్టిన ఆ తీవ్రకారణాలను

జయింపగల వైద్యమేమీ చెయ్యలేక, నా మామూలు మందులన్నీ ఆమె యెడ వృధాకాగా, అసహాయుణ్నై దిగులుపడి చూస్తో కూచునేవాణ్ణి. సృష్టి పట్టుదలకూ, ఆమె మనోనిశ్చయానికి మధ్య నలిగి ఆమె శరీరం యమబాధ పడుతోంది.

ఒక రాత్రి నేను భోజనంచేసి లేస్తోవుండగా, మా యింటికి వొచ్చింది ఆమె.

"నా పని అయిపోయింది. ఇంక నాకు గతిలేదు. కడుపు తున్నాను."

"ఏమిటి ?"

"కడుపుతున్నాను."

"మీరు"

"అవును. నా తోటవాడు, డాక్టరుగారూ ! వాడు....నేను తోటలో నడుస్తో మూర్ఛపడ్డాను. నేను కిందపడుతో వుండగా, వాడుచూసి, పాపం, పరిగెత్తుకొచ్చి పట్టుకొని పడుకోబెట్టడానికి యింటోకి తీసుకుపోతున్నాడు. నా కెందుకు పుట్టిందో ఆ బుద్ధి, ఎట్లా కలిగిందో ఆ కోర్కె! నేను కాదు లెండి నాకు తెలీకుండానే ఆ నా చేతులు స్వాధీనంతప్పి, వాణ్ణి కావిలించుకున్నాయి. మీకు తెలుసునుగా నా జాడ్యం. నేను పాపం చేశాను. మా యిద్దరికీ సంబంధం యేర్పడ్డది. మానుకుందామంటే నా చాత కాలేదు. ఇట్లా అయింది నా గతి. ఈ కడుపు తీసేసుకోవాలని ప్రయత్నించాను. మసిలే నీళ్ళలో స్నానాలు చేశాను. మందులు తిన్నాను కాని లాభమేమీ లేకపోయింది. నా తలిదండ్రులకి యీ సంగతి తెలిస్తే! నన్ను ముక్కల కింద చెక్కుతారు. అయిపోయింది నా పని. నా చెల్లెలు మొగుడు యేమంటాడు ? నీ అక్క యిట్లాంటిదని దాన్నేమిచేస్తాడో యేమో! నా స్నేహితులు, బంధువులు, ఇంక మా అమ్మ ఎట్లా తలెత్తుకుంటారు ?"

నే నామెని యేదన్నా దూరదేశానికి వెళ్ళి కాన్పు చేసుకోమని సలహా నిచ్చాను. తరవాత నేను వెళ్ళి చాలాసార్లు ఆమెని చూశాను ఆమెకి మతిపోయింది. తన లోపల పెరిగే పిల్లని తలుచుకుని, తన సిగ్గుని తలుచుకొని బాధపడుతోంది. పగలు యెవరికి కనపడదు. ఈ రహస్యం బైటపడుతుందని ప్రతిరాత్రీ బట్టలన్నీ తీసేసి, అద్దంముందు నుంచుని పరీక్షించు కుంటుంది. కటికనేలమీద పడి యేడుస్తుంది. రాత్రికి యిరవైసార్లన్నా దీపం వెలిగించి అద్దంలో తనని తాను చూసుకుంటుంది. పొట్టలో పిండాన్ని ముక్కలు చెయ్యాలని. గుప్పెట్లతో పొట్టని బాదు కుంటుంది. కాని అది అట్లానేవుంది. ఆ పిండానికీ ఆమెకీ పెద్ద యుద్ధం కలగడం ప్రారంభించింది. ఆమెని తప్పించుకోడానికి అది ఇటూ అటూ తప్పించుకుని జరుగుతుంది. డాక్టర్లకి తెలుసు, పిండంకూడా తన ప్రాణ రక్షణకోసం యెంత తంటాలుపడుతుందో. ఆమె తన బలువంతా పొట్టమీద ఆనించి కటిక నేల్ని బలంగా దొర్లుతుంది. పొట్టమీద అఖండమైన బలువులు పెట్టుకుని నిద్రపోతుంది. తన ప్రాణాల్ని హరింపగల శత్రువుని ద్వేషించినట్టు ద్వేషించింది, తన పిల్లని.

ఒక రోజు ఆమెతల్లి "ఏమిటే శశీ, మరీ యింత లావవుతున్నావు? నీ పెనిమిటే వుంటే యీ పాటికి కడుపుతున్నా వనుకుందును" అంది. తమ కూతురు యిట్లాంటి పని చేస్తుందని కలలోనన్నా అనుకోలేదు. దాంతో శశికి పూర్తిగా పిచ్చెక్కింది. గదిలోకిపోయి పొట్టని బాదుకుంది. చితక కొట్టింది. బల్లల మూలకేసి అదుముకుంది. చివరికి నిరాశచెంది పనసకత్తి ఒకటి తెచ్చింది. దీపం వెలిగించింది. అద్దంముందు పెట్టింది. ఆ లోపలి పిల్లమీది ద్వేషంతో వొళ్ళు దహించుకుపోతోంది. ఎక్కడి పిశాచి అది, తనని వదలదు. ఎట్లా వదలదోచూడాలి. దాన్ని పైకి పీకి, తన చేతుల్లో పట్టుకుని, గొంతు నలిపి, ఇప్పుడేం చేస్తావు? అని దూరంగా పారెయ్యాలి. కత్తితీసి పొట్టమీద ఒక్కపోటు పొడిచి, పొట్టని చీల్చుకుంది.

చాలా సూటిగా నేర్పుగా పనిచేసింది. చప్పున దాంట్లో వేలుదూర్చి, ఒక కాలుపట్టి బైటికి, లాగెయ్యాలని చూసింది. కాని, ఆమెకీ పిల్లకీ ఎడ

తెగని బంధాలు పెట్టింది టక్కరుసృష్టి. వాటిని కోసుకోలేక వాటినికూడా లాగేయ్యాలని ప్రయత్నించి సాధ్యమయ్యే లోపలే శశి చచ్చి కింద పడి పోయింది; పెద్ద రక్తపు మడుగులో.

"ఆమె ఏం నేరం చేసిందంటారు," అని అడిగి పూరుకున్నాడు డాక్టరు.

శీతాయమ్మగారు ఏమీ మాట్లాడలేదు.

[శ్రీ మపాసా కథకు అనువాదం. పేర్లు మాత్రం మార్చి తెలుగులో వ్రాశాను.]

★

# సీతయ్య

మధ్యాన్నమయింది. పొద్దున ముసలమ్మ దగ్గిరనుంచి అడుక్కున్న కానీతో రంగుచూసి మోసపోయి ఆ చక్కెర బిళ్ళలు కొనకపోతే, గుగ్గిళ్ళు కొని తింటే ఇప్పుడింత ఆకలి వెయ్యదుకదా అని పశ్చాత్తాప పడ్డాడు సీతయ్య. మధ్యాన్నం టిఫెన్ కొరకై మామూలు స్థలాలు వెతికాడు. కోమటిరత్నం యింటిముందు పుల్లిస్తరాకులు కుక్కలు చప్పగా నాకేశాయి. ఏమీ ఆశలేదు. ఈవాళ దోసకాయలేమీ కుళ్ళినట్టులేవు. దుకాణం దగ్గిర